# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | గురువారం – 10 – సెప్టెంబర్ – 2026 | సంపుటి : 4 | సంచిక : 98 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# కాళోజీకి సీఎం ఘన నివాళులు

## జయంతి సందర్భంగా పుష్పాంజలి ఘటింపు

## మహనీయుడి సేవలను స్మరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు)**

ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. కాళోజీ సాహిత్య, సామాజిక సేవలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులర్పించారు.

మిగతా 2లో..

# దళితులకు న్యాయం జరగాలి: భట్టి

- అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై విమర్శలు
- దళితుల పట్ల అవమానకర వైఖరిని ఖండన
- బలహీన వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్



2లో

# గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా టి. ఉషారాణి బాధ్యతలు


- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ఉషారాణి
- నూతన బాధ్యతలపై మంత్రి అభినందనలు
- రోగుల సంరక్షణ బలోపేతంపై దిశానిర్దేశం
- హాస్పిటల్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం

2లో



# దోషులపై కఠిన చర్యలు

- శాసనసభ ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశం
- క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వ నిర్ణయం
- స్పీకర్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు)**

శాసనసభ వర్షాకాల సమావేశాల తొలి రోజు సెప్టెంబర్ 6న చోటుచేసుకున్న సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి జరిగిన అనుచిత వ్యాఖ్యలు, ఇతర పరిణామాలపై సభలో సుదీర్ఘ చర్చ అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. స్పీకర్‌ను అవమానించేలా జరిగిన ఘటనలపై యావత్ శాసనసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. సభాపతి స్థానానికి జరిగిన

మిగతా 2లో..

# ప్రజాస్వామ్యంలో విమర్శలు ఉండాలి, అవమానాలు కాదు: దామోదర్

- స్పీకర్‌పై వ్యాఖ్యలు ఖండనీయం
- వ్యక్తిగత అవమానాలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదన్న మంత్రి
- మహిళలను కించపరిచే వ్యాఖ్యలు బాధాకరమని వ్యాఖ్య.. రాజ్యాంగ వ్యవస్థలను గౌరవించాలని సూచన



2లో

# ఎమ్మెల్సీ వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రజలంతా చూశారు: మంత్రి

- వీడియోల్లో ఘటన స్పష్టంగా కనిపిస్తోంది
- ఎమ్మెల్సీని వెనుకేసుకొచ్చేందుకు ప్రయత్నించడం బాధాకరం
- మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వానికి పూర్తి గౌరవం
- పోలీసుల అమర్యాద రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటాం



2లో

# ఆయుష్ సేవల బలోపేతానికి కేంద్రం పిలుపు

- రాష్ట్రాలు నాణ్యమైన సేవలు అందించాలని సూచన
- హైదరాబాద్ లో జాతీయ స్థాయి వర్క్ షాప్ నిర్వహణ
- 30 రాష్ట్రాల ప్రతినిధులు హాజరైన కీలక సమావేశం





**హైదరాబాద్, సెప్టెంబర్ 09, (తెలంగాణ ముచ్చట్లు) :**

దేశవ్యాప్తంగా అందుబాటులో ఉండే, ప్రజా కేంద్రీకృత, నాణ్యమైన ఆయుష్ సేవలను మరింత బలోపేతం చేయాలని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు బలంగా పిలుపునిచ్చారు. ఆయుష్ వైద్య విధానం ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, దీనిని ప్రతి మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ రంగ అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని, రాష్ట్రాలు కూడా తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించడంలో ఆయుష్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. హైదరాబాద్ శివార్లలోని కన్హా శాంతి వనంలో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో

మిగతా 2లో..

# గవర్నర్‌కు కాంగ్రెస్ దౌర్జన్యాలను వివరించాం

- శాసనసభ తొలి రోజు జరిగిన ఘటనలపై గవర్నర్‌కు ఫిర్యాదు
- మహిళా ఎమ్మెల్యేలపై దాడుల ఆధారాలు సమర్పించామని వెల్లడి
- హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం పట్టించుకోలేదని కేటీఆర్ ఆరోపణ
- అవసరమైతే జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామని స్పష్టం



**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):**

లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇటీవల శాసనసభ సమావేశాల తొలి రోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో

మిగతా 2లో..

# బీజేపీ–బీఆర్ఎస్ ఒకే సిద్ధాంతం: మంత్రి సీతక్క

- ఒకే భాష, ఒకే విధానంతో ముందుకు సాగుతున్న బీజేపీ, బీఆర్ఎస్
- దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దారుణం
- ములుగులో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించిన మంత్రి సీతక్క



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా టి. ఉషారాణి బాధ్యతలు

**హైదరాబాద్, సెప్టెంబ ర్ 09, (తెలంగాణ ముచ్చట్లు) :** సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ నూతన సూపరింటెండెంట్ గా నియమితులైన టి. ఉషారాణి బుధవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. ఈ సందర్భంగా తన నూతన బాధ్యతలకు సంబంధించిన వివరాలను మంత్రికి తెలియజేశారు. రాష్ట్రంలోనే అతి పెద్ద ప్రభుత్వ హాస్పిటల్స్ లో ఒకటైన గాంధీ హాస్పిటల్ బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ ఉషారాణికి అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. వైద్య రంగంలో ఆమెకు ఉన్న సుదీర్ఘ అనుభవం హాస్పిటల్ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బాధ్యతల నిర్వహణలో ప్రభుత్వం నుంచి పూర్తి సపోర్ట్ ఉంటుందని హామీ ఇచ్చారు.

రోగులకు మెరుగైన సేవలు అందించడంలో, హాస్పిటల్ పరిపాలనను మరింత బలోపేతం చేయడంలో విజయవంతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లో సేవల క్వాలిటీని పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ట్రీట్ మెంట్ అందించడమే లక్ష్యమని తెలిపారు. గాంధీ హాస్పిటల్ కు రోజూ వేల సంఖ్యలో రోగులు వస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి సూచించారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగుల సంరక్షణకు పెద్దపీట వేయాలని తెలిపారు. ఓపీ సర్వీసులు, ఎమర్జెన్సీ విభాగం, మందుల పంపిణీలో ఎలాంటి లోటు రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం వైపు నుంచి గాంధీ హాస్పిటల్ అభివృద్ధికి అవసరమైన అన్ని సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మౌలిక వసతుల కల్పన, ఆధునిక పరికరాల సమకూర్చడం, స్టాఫ్ నియామకం వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతుందని పేర్కొన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఉషారాణి తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని మంత్రికి తెలిపారు. హాస్పిటల్ లో పరిశుభ్రత, క్రమశిక్షణ, సేవా భావాన్ని మరింత పెంపొందిస్తానని పేర్కొన్నారు.

# గవర్నర్‌కు కాంగ్రెస్ దౌర్జన్యాలను వివరించాం






(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు తమపై ప్రదర్శించిన దౌర్జన్యాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో వ్యక్తం చేసిన నిరసన తరహాలోనే టీషర్ట్ల ద్వారా నిరసన తెలపాలని భావించిన తమను శాసనసభలోకి అనుమతించకుండా రోడ్డుపైనే అడ్డుకున్నారని ఆరోపించారు.

తమపై జరిగిన దాడులు, ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనలకు సంబంధించిన ఫొటోలు, ఇతర ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు కేటీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ మహిళా నేత సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును కూడా వివరించామని తెలిపారు. తమపై దాడులు జరిగాయని ఫిర్యాదులు చేసినప్పటికీ పోలీసులు స్పందించలేదని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ తమపై దాడి చేసి తిరిగి తమనే అపవాదులు మోపుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ ఇంటి వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్లి ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారని, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేశారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ ఘటనల వెనుక రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఉందని ఆరోపించారు.

హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ శాసనసభ, శాసనమండలిలోకి తమను అనుమతించలేదని, రాజ్యాంగ సంస్థలు, న్యాయస్థానాల పట్ల ప్రభుత్వానికి గౌరవం లేదని గవర్నర్‌కు వివరించినట్లు కేటీఆర్ తెలిపారు. ఇదే కారణంగా తమను సస్పెండ్ చేశారని ఆరోపించారు. స్పీకర్‌పై తమకు పూర్తి గౌరవం ఉందని, అయితే కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని వాడుకుంటోందని కేటీఆర్ అన్నారు. జరగని విషయాలను జరిగినట్లుగా చిత్రీకరిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరగాలని కోరినట్లు తెలిపారు. తాము ప్రస్తావించిన ప్రతి అంశంపై విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారని కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణలో న్యాయం జరగకపోతే జాతీయ మహిళా కమిషన్‌ను కూడా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం విడుదల చేసినట్లు చెబుతున్న ఏఐ ఫొటోలు, వీడియోలపై ఇప్పటికే ఫిర్యాదు చేశామని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆయుష్ సేవల బలోపేతానికి కేంద్రం పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

స్ట్రెంతెనింగ్ ది ఆయుష్ ఎకోసిస్టమ్ ఇన్ స్టేట్స్ అండ్ యూనియన్ టెరిటరీస్ అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్ షాప్ ను ఘనంగా నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ప్రతాప్ రావు జాదవ్ మాట్లాడుతూ ఆయుష్ రంగంలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానాలకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని, దీనిని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి విధానాలను ప్రజల్లోకి మరింత చేరవేయాలని సూచించారు. ఈ వర్క్ షాప్ ద్వారా రాష్ట్రాల మధ్య అనుభవాలను పంచుకోవచ్చని చెప్పారు. ఈ జాతీయ వర్క్ షాప్ కు కేంద్ర ప్రభుత్వానికి చెందిన సీనియర్ అధికారులు, 30కి పైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు, వివిధ సంస్థలకు చెందిన నిపుణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆయుష్ ఎకోసిస్టమ్ ను బలోపేతం చేయడంపై అందరూ తమ అనుభవాలు, తాము అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులు, సహకార చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి రాష్ట్రంలో ఆయుష్ సేవలు ఎలా ఉన్నాయి, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి, వాటిని ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై కూలంకషంగా మాట్లాడారు. నీతి ఆయోగ్ నిర్వహించిన ఈ సమావేశం భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకంగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఆయుష్ విధానం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య విధానాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి జిల్లా, మండల స్థాయిలో ఆయుష్ హాస్పిటల్ లను బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ లో ఆయుష్ రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, యువతను ఈ రంగం వైపు ప్రోత్సహించాలని కోరారు. సాంప్రదాయ వైద్యానికి ఆధునిక టెక్నాలజీని జోడించి మరింత నాణ్యమైన సేవలు అందించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్ రంగ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటోందని, కొత్త ఆయుష్ కాలేజీలు, హాస్పిటల్ లు, రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. నీతి ఆయోగ్ నిర్వహించిన ఈ వర్క్ షాప్ వల్ల రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత పెరుగుతుందని, ఒకరి అనుభవాలను మరొకరు తెలుసుకుని అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆయుష్ సేవలను మరింత పటిష్టం చేయడానికి ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందని, దేశవ్యాప్తంగా ఆయుష్ కు ఒకే విధమైన విధానాన్ని తీసుకురావాలని చెప్పారు. భవిష్యత్తులో ఆయుష్ సేవలను కేవలం నగరాలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ వైద్యుడిని నియమించాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పీబీఐ విడుదల చేసిన ప్రెస్ రిలీజ్ ప్రకారం ఈ వర్క్ షాప్ లో తీసుకున్న నిర్ణయాలను త్వరలోనే అమలు చేస్తామని, ఆయుష్ రంగాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టడానికి కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# దోషులపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

అవమానం మొత్తం శాసనసభకు జరిగిన అవమానంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో స్పీకర్‌కు ప్రభుత్వం, శాసనసభ పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ సంఘటనల్లో పాల్గొన్న వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా కొందరు వ్యక్తులు సభా గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. అధికారులపై దాడులు చేయడమే కాకుండా సభాపతి స్థానాన్ని కించపరిచే చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. మహిళలను గౌరవించే సంస్కృతి ఉన్న సమాజంలో ఒక తల్లిని అవమానించేలా ప్రవర్తించడం అత్యంత దురదృష్టకరమని ముఖ్యమంత్రి అన్నారు. తల్లిని, మహిళను శక్తి స్వరూపిణిగా భావించే భారతీయ సంస్కృతికి విరుద్ధంగా ఈ చర్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి ప్రవర్తన సమాజం అంగీకరించదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపేందుకు అనేక మార్గాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత అవమానాలకు దిగడం సరైంది కాదని సీఎం అభిప్రాయపడ్డారు. సభాపతి మనోభావాలను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొన్ని వ్యాఖ్యలు చేసినట్లు కనిపిస్తోందని అన్నారు. చట్టపరంగా దోషులను శిక్షించే విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం శాసనసభలో ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాలని భావించిందని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య, ధరణి, 22(ఏ) తదితర కీలక అంశాలతో పాటు ప్రతిపక్షాలు లేవనెత్తిన పలు విషయాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే కొన్ని పరిణామాల కారణంగా ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డంకులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు.

# కాళోజీకి సీఎం ఘన నివాళులు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య అభివృద్ధికి కాళోజీ అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ప్రతిబింబిస్తూ సామాజిక చైతన్యానికి కాళోజీ విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు.

తెలంగాణ మాండలిక భాషకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో కాళోజీ పాత్ర విశేషమని తెలిపారు. ఆయన రచనలు నేటికీ యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, మానవ విలువల కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు ఆదర్శమని అన్నారు. కాళోజీ జీవితం ప్రజల కోసం అంకితమైనదని, ఆయన ఆలోచనలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య రంగంలో ఆయనకు ఉన్న ప్రత్యేక స్థానం ఎప్పటికీ చెరగదని అన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కూడా పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ఆయనకు లభించిన గొప్ప గౌరవమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. కాళోజీ ఆశయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అభిప్రాయపడ్డారు.

# దళితులకు న్యాయం జరగాలి: భట్టి

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించిన వారే ఇప్పుడు న్యాయం కోరుతున్నట్లు మాట్లాడటం విరుద్ధంగా ఉందని విమర్శించారు. శాసనసభలో మాట్లాడిన భట్టి విక్రమార్క, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనలను ప్రస్తావించారు. అలాంటి వ్యాఖ్యలను నిరసిస్తూ దళితులు స్పందించిన సందర్భంలో వారి పట్ల అవమానకరంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ ఘటనలు సమాజంలో ఆందోళన కలిగించాయని పేర్కొన్నారు.

దళితులు రోడ్డుపై నడిచారని ఆ ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేసినట్లు వచ్చిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యలు సామాజిక సమానత్వానికి విరుద్ధమని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, గౌరవాన్ని ప్రతి ఒక్కరికీ సమానంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలపై వివక్షకు తావులేకుండా సమాజం ముందుకు సాగాలని భట్టి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.

సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికి గౌరవం, సమాన హక్కులు ఉండాలని అన్నారు. కుల, వర్గ వివక్షలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దళితులు, గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని భట్టి విక్రమార్క వివరించారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. న్యాయం కోరాల్సింది అవమానాలకు గురైన వర్గాలేనని, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

## ప్రజాస్వామ్యంలో విమర్శలు ఉండాలి, అవమానాలు కాదు: దామోదర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** శాసనసభలో ఇటీవల చోటుచేసుకున్న ఘటన తనను తీవ్రంగా బాధించిందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు స్థానం ఉన్నప్పటికీ వ్యక్తిగత అవమానాలకు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. రాజకీయ కక్షతో తల్లిని దూషించడం అత్యంత బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. రాజకీయ భేదాలు ఉన్నా వ్యక్తిగత దూషణలు, అసభ్యకర వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు.

మన మాటల్లో సంస్కారం, మన ప్రవర్తనలో గౌరవం ఉండాలని మంత్రి సూచించారు. గౌరవ స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించడం సరికాదని, సభా సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ కోపాన్ని రాజ్యాంగ వ్యవస్థలపై ప్రదర్శించడం బాధాకరమని దామోదర్ రాజనర్సింహ వ్యాఖ్యానించారు. గౌరవప్రదమైన స్పీకర్ కుర్చీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులు తమ ప్రవర్తన ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత ఉందని మంత్రి అన్నారు. రాజకీయ విభేదాలు ఎంత ఉన్నా రాజ్యాంగబద్ధ సంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని తెలిపారు. సభా గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు, చర్యలను సమాజం సమర్థించదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ పరస్పర గౌరవంతో రాజకీయాలు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్సీ వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రజలంతా చూశారు: మంత్రి

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** శాసనసభ స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వ్యవహరించిన తీరును రాష్ట్ర ప్రజలంతా గమనించారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బుధవారం శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన వీడియోల్లో జరిగిన పరిణామాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు ఆ ఎమ్మెల్సీని సమర్థిస్తూ మాట్లాడటం బాధాకరమని మంత్రి వ్యాఖ్యానించారు. "అలా అనుకుంటే, అలా భావించినట్లయితే" అంటూ ఘటనను తేలికగా తీసుకునే ప్రయత్నం చేయడం సమంజసం కాదని అన్నారు. స్పీకర్ పదవికి, శాసనసభ గౌరవానికి భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో రాజ్యాంగబద్ధ పదవులకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు.

మహిళా శాసన సభ్యులు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర విచారణ నిర్వహిస్తామని చెప్పారు. ఒకవేళ విచారణలో పోలీసులు మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అమర్యాదగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. వాస్తవాలను వెలికితీసి న్యాయం జరిగేలా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

## బీజేపీ–బీఆర్ఎస్ ఒకే సిద్ధాంతం: మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల సిద్ధాంతం ఒకటేనని, రెండు పార్టీలు ఒకే భాష మాట్లాడుతూ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని రాష్ట్ర మంత్రి సీతక్క శాసనసభలో విమర్శించారు. ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశాన్ని బీజేపీ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆమె గుర్తుచేశారు. అదే తరహాలో తెలంగాణలోని ములుగు జిల్లాలో దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆరోపించారు. ఈ ఘటన సమాజాన్ని అవమానించే చర్యగా నిలిచిందని, దళితుల గౌరవాన్ని దెబ్బతీసే ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సమానత్వాన్ని కాపాడాల్సిన రాజకీయ పార్టీలు ఇటువంటి వివక్షపూరిత చర్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని సీతక్క అన్నారు. కుల వివక్షను ప్రోత్సహించే విధంగా వ్యవహరించడం సమాజంలో విభేదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడం కంటే ఘోరమైన చర్య మరొకటి ఉండదని ఆమె వ్యాఖ్యానించారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజాస్వామ్య సమాజం సహించదని సీతక్క స్పష్టం చేశారు. దళితుల పట్ల వివక్షను ప్రదర్శించే ఏ రాజకీయ శక్తినైనా ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారని అన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న మంత్రి, కుల వివక్షకు తావులేని సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే శంకర్‌పై బీఆర్ఎస్ ఫిర్యాదు

- **ఖబర్దార్ శంకర్ అంటూ బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**



**పెద్దమందడి,సెప్టెంబర్09(-తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వనపర్తి జిల్లా మాజీ రైతుబంధు అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దమందడి మండల బీఆర్ఎస్ నాయకులు పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ నాయకులు, శంకర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటం, ఆయన అందించిన సేవలను గుర్తు చేస్తూ, మాజీ ముఖ్యమంత్రిపై ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజా ప్రతినిధులు హుందాతనంతో, బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే శంకర్ వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే శంకర్ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ 'ఖబర్దార్ శంకర్' అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.అనంతరం జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేసి, ఎమ్మెల్యే శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏఐ-ఐఓటీపై విద్యార్థులకు నైపుణ్యా శిక్షణ




**సత్తుపల్లి, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు):** బి.గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఐఈటీఈ విజయవాడ, కిట్స్‌కార్ట్ హైదరాబాద్ సంస్థల సహకారంతో నిర్వహించిన ఏఐ-ఐఓటీపై మూడు రోజుల వర్క్‌షాప్ బుధవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కిట్స్‌కార్ట్ టెక్నాలజీస్ సీఎండీ, ట్రైనర్ జి. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. ఐఓటీ ద్వారా డేటాను సేకరించి, ఏఐ సాంకేతికతతో ఆ డేటాను విశ్లేషించి అవసరమైన నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా విద్యార్థులు ఏఐ, ఐఓటీపై అవగాహనతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఐ, ఐఓటీ సాంకేతికతలు అన్ని రంగాల్లో వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించడంతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగ రంగంలో మెరుగైన అవకాశాలు పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శేషారత్నకుమారి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏఐ, ఐఓటీతో పాటు సాఫ్ట్‌వేర్ వినియోగంపై ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే వర్క్‌షాప్ ఉద్దేశమన్నారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి. శేఖర్ బాబు మాట్లాడుతూ.. ఏఐ, ఐఓటీని వినియోగించే సమయంలో వ్యక్తిగత సమాచారం, గోప్యతను కాపాడుకోవడం ముఖ్యమని, సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా హెటెరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, సాయిస్ఫూర్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని విద్యార్థులను అభినందించారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, కోఆర్డినేటర్లు పి. నాగశేఖర్, ఎం. వరప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజాకవి కాళోజీకి మేయర్ ఘన నివాళి



- **ప్రజల మాటను తన కలంతో వినిపించిన మహాకవి కాళోజీ**
- **తెలంగాణ యాస, భాషకు కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయం – మేయర్**

**కరీంనగర్, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ రేకుర్తి 19వ డివిజన్‌లో కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ విగ్రహానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ భాష, యాసలోని మాధుర్యాన్ని తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని మేయర్ కొనియాడారు. కాళోజీ ఆశయాలు, రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ గౌడ్, కాళోజీనగర్ కాలనీల అధ్యక్షులు రమణారెడ్డి, నారాయణరెడ్డితో పాటు పలువురు డివిజన్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# కాళోజీ స్ఫూర్తితో తెలంగాణ భాషకు మరింత ప్రాచుర్యం

- **జే.వి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం.**
- **భాష, సాహిత్యం, సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.**
- **ప్రిన్సిపాల్ డా. ఎన్. గోపి.**



**సత్తుపల్లి, సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సత్తుపల్లి జే.వి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో బుధవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. గోపి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా. ఎన్. గోపి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల జీవన విధానం, భాష, సంస్కృతి, సామాజిక సమస్యలను కాళోజీ తన రచనల ద్వారా సమాజానికి చాటిచెప్పారని అన్నారు. ఆయన సాహిత్యం ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడంతో పాటు తెలంగాణ భాష, యాస, సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ భాషా దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతిపై అవగాహన పెరుగుతుందని అన్నారు. మాతృభాషను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కాళోజీ ఆశయాలను, సాహిత్య సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు విభాగాధిపతి డా. సి.హెచ్. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తెలంగాణ భాషకు ప్రత్యేకమైన వైశిష్ట్యం ఉందని, తెలంగాణ మాండలికంలో ఎంతో మాధుర్యం దాగి ఉందని అన్నారు. ప్రజల జీవన విధానంతో తెలంగాణ భాషకు విడదీయరాని అనుబంధం ఉందని వివరించారు. కాళోజీ రచనలు సామాన్య ప్రజల జీవితాలను ప్రతిబింబిస్తూ సామాజిక చైతన్యాన్ని పెంపొందించాయని తెలిపారు. తెలుగు అధ్యాపకులు డా. ఎం. మాధవి మాట్లాడుతూ కాళోజీ సాహిత్య ప్రస్థానం, ఆయన రచనల్లోని సామాజిక స్పృహ, ప్రజాస్వామ్య విలువలు, మానవతా దృక్పథం గురించి విద్యార్థులకు వివరించారు. తెలంగాణ భాషా వైశిష్ట్యాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. మహేష్, తెలుగు విభాగాధిపతి డా. సి.హెచ్. పూర్ణచంద్రరావు, తెలుగు అధ్యాపకులు డా. ఎం. మాధవి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతిపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేలా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

- **గిరిజ పెద్దమందడి ఆశ వర్కర్ల మండల అధ్యక్షురాలు**




**పెద్దమందడి,సెప్టెంబర్09(తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు గిరిజ డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి పెద్దమందడి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా గిరిజ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు దాటినా ఆశా కార్యకర్తల వేతనాలను ఒక్క రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని కోరారు.అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని, ఉదయం పోలీస్ స్టేషన్లలో ఉంచడం దారుణమని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలపై నిర్బంధ చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ నాయకులు సురేష్ నిరసనకు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లక్ష్మి, మహేశ్వరి, పద్మ, కళావతి, ఉమాదేవి, పోచమ్మ, భారతి, రాధ, మన్నెమ్మ, శంకరమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భాషే మన అస్తిత్వానికి ఊపిరి

- **కాళోజీ స్ఫూర్తితో తెలంగాణ భాషను కాపాడాలి**
- **ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం**



**కరీంనగర్, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవం, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కలువకుంట రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భాష మన సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీక అని అన్నారు. యువత తమ సహజమైన తెలంగాణ భాషలో మాట్లాడేందుకు గర్వపడాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాళ్లు పి. నితిన్, రాజయ్య మాట్లాడుతూ భాష ఒక ప్రాంత చరిత్ర, సంస్కృతికి ప్రతిబింబమని పేర్కొన్నారు. తెలుగు విభాగాధిపతి బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా మాతృభాషను మరవకూడదన్నారు. డా. డి. ప్రకాష్ మాట్లాడుతూ పెద్దలతో మమేకమై మాట్లాడటం ద్వారా తెలంగాణ నుడికారం సహజంగా అలవడుతుందని తెలిపారు. డా. ఆర్. శ్రీనివాస్ కాళోజీ నిర్భయ వ్యక్తిత్వాన్ని, తెలంగాణ కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి. ఎలిజబెత్ రాణి భాషపై పట్టు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులు తెలంగాణ భాష, నుడికారం, స్థానిక పదప్రయోగాలపై తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య

- **బి.గంగారంలో విషాద ఘటన.. కారణాలు తెలియరాలేదు.**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.**



**సత్తుపల్లి,సెప్టెంబర్9(తెలంగాణముచ్చట్లు):-** సత్తుపల్లి మండలం బి.గంగారం గ్రామంలో ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి శ్రీచరణ్‌రెడ్డి (20) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటికి వచ్చిన శ్రీచరణ్‌రెడ్డి ఇంటి వద్దే ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి వెంటనే సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న సత్తుపల్లి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణ ప్రగతికి నిపుణుల భాగస్వామ్యం అవసరం

- **డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి**



**వనపర్తి,సెప్టెంబర్09(తెలంగాణ ముచ్చట్లు-):** తెలంగాణ రాష్ట్ర ప్రగతికి వివిధ రంగాలకు చెందిన నిపుణుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయలో జరిగిన సంస్థ తెలంగాణ నాయకత్వ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో వివిధ రంగాల నిపుణుల అనుభవం, సూచనలు, సలహాలను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఆదిత్య రెడ్డి పేర్కొన్నారు. నిపుణుల మధ్య సమన్వయాన్ని పెంచడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సంస్థ కార్యకలాపాలను విస్తరించేందుకు కృషి చేయాలని అన్నారు.సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి, వివిధ వృత్తి విభాగాలను చురుకుగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధిలో నిపుణులను మరింతగా భాగస్వాములను చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ప్రవీణ్ చక్రవర్తితో తెలంగాణ ప్రతినిధులు సమావేశమై సంస్థాగత బలోపేతం, వివిధ విభాగాల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.సమావేశంలో నావికా హర్షే, దీపక్ జాన్, ఖలీద్ సైపుల్లా, శశాంక్ పసుపులేటి, సంతోష్, సృజన, సందీప్ భూషణ్, లతీఫ్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి.. అరెస్టులతో ప్రజల దృష్టి మళ్లించొద్దు

- **శంకర్‌గౌడ్ అరెస్టును ఖండించిన జనసేన నాయకులు**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి: కాస రాజు పటేల్**



**కరీంనగర్, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జనసేన పార్టీ తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ అరెస్టుకు నిరసనగా జిల్లా నాయకులు కాస రాజు పటేల్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కాస రాజు పటేల్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిని అరెస్టులతో భయపెట్టడం సరికాదన్నారు. 22ఏ భూముల సమస్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పరిష్కరించకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు అరెస్టులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా అరెస్టుల పర్వం కొనసాగిస్తే జనసేన ఆధ్వర్యంలో ఉవ్వెత్తున ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేటర్ అభ్యర్థులు పొన్నాల తిరుపతి, వీర్ల శ్రీనివాస్‌రావు, అంబాల సృజన్‌కుమార్, జనసేన నాయకులు అన్వేష్‌రెడ్డి, వీర మహిళలు రాగుల శిరీష, కుంట సుజాత, గుండా శకుంతల, గాలిపెల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆటో డ్రైవర్ కుమార్తె డాక్టర్‌గా..



- కష్టాలను అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించిన షేక్ సనా

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** పేదరికం చదువుకు అడ్డంకి కాదని, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించింది ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన షేక్ సనా. సాధారణ ఆటో డ్రైవర్ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్‌లో సీటు సాధించి స్ఫూర్తిగా నిలిచింది.

సనా తండ్రి షేక్ యూసుఫ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పరిమిత ఆదాయంతో కుటుంబ అవసరాలను తీర్చుకుంటూనే తన పిల్లల చదువుకు ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. తండ్రి పడుతున్న కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకున్న సనా వైద్యురాలిగా ఎదగాలనే లక్ష్యంతో కష్టపడి చదివి నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచింది.

కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్‌లో భాగంగా హైదరాబాద్‌లోని షాదాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సనాకు ఎంబీబీఎస్ సీటు లభించింది. అయితే వైద్య విద్యకు అవసరమైన భారీ ఫీజులు చెల్లించడం ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికంగా భారంగా మారింది.

ఈ పరిస్థితిని గుర్తించిన షాదాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ సారిబ్ రసూల్ ఖాన్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు. సనా ప్రతిభను, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించి ఉచితంగా వైద్య విద్యను అందించేందుకు సహకరించారు.

ఈ సందర్భంగా అడ్మిషన్ కమిటీ సభ్యుడు అబ్దుల్ మాజిద్ సనా కుటుంబానికి ఫీజు రుసుముకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సహకారం సనా కుటుంబానికి ఎంతో భరోసానిచ్చింది.

పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో అడుగుపెట్టిన షేక్ సనా ప్రయాణం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ప్రతిభ, పట్టుదల, కృషికి తోడు సమాజం నుంచి ప్రోత్సాహం లభిస్తే ఆర్థిక పరిస్థితులు ఎన్ని ప్రతికూలంగా ఉన్నా లక్ష్యాలను సాధించవచ్చని ఆమె విజయం చాటి చెబుతోంది.

# కరాటే విద్యతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం



- జలీల్ సేవలను అభినందించిన బీసీ జేఏసీ నాయకులు

**హుజురాబాద్,సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** పట్టణంలోని న్యూ కాకతీయ మోడల్ హైస్కూల్‌లో గ్లోబల్ షటోకాన్ కరాటే డు ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఎల్లో బెల్ట్‌లను ప్రదానం చేశారు. కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, జేఏసీ నాయకుడు ఉప్పు శ్రీనివాస్ అతిథులుగా పాల్గొన్నారు. రాచపల్లి హేమతో పాటు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వారి చేతుల మీదుగా ఎల్లో బెల్ట్‌లను బహుకరించారు.

ఈ సందర్భంగా చందుపట్ల జనార్ధన్, ఉప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ కరాటే తపస్విగా ఎంతో అంకితభావంతో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరుస్తూ బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. జలీల్ హుజురాబాద్ ముద్దుబిడ్డగా కరాటే రంగంలో సేవలందించడం పట్టణ ప్రజలకు గర్వకారణమని అన్నారు.

కరాటే విద్య విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసికంగా కూడా ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలకు కరాటే శిక్షణ ఆత్మస్థైర్యాన్ని కల్పించడంతో పాటు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని అందిస్తుందని తెలిపారు.

ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని వారు సూచించారు. తమను తాము రక్షించుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ఇతరులను కూడా రక్షించే బాధ్యత రేపటి పౌరులైన విద్యార్థులపై ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కరాటే శిక్షణకు పంపించి, వారికి ఆత్మరక్షణతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో కరాటే విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అధికారులకు ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్ర పుస్తకాల అందజేత



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం నగర శాఖ ఆధ్వర్యంలో ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర, ఆయన బోధనలు, మానవతా విలువలను పరిచయం చేసే పుస్తకాలను కలెక్టర్ కార్యాలయంలోని మహిళా అధికారులైన జాయింట్ డైరెక్టర్ బ్యాక్‌వర్డ్ క్లాస్ డెవలప్‌మెంట్ జ్యోతి, హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అనసూయ, జిల్లా వెల్ఫేర్ అధికారి ప్రమీల, ఎంప్లాయ్‌మెంట్ అధికారి మాధవి, డీఆర్వో సూపరింటెండెంట్ సాదియా , సివిల్ సప్లై అధికారి సృజన, ఉమెన్స్ హబ్ కోఆర్డినేటర్ సమ్రీన్ ఇతర మహిళా అధికారులకు పుస్తకాలను అందజేశారు.

స్వామి లక్ష్మీ శంకరాచార్య రచించిన మహమ్మద్ ప్రవక్త (సఅసం) చూపిన జీవన ప్రబోధనలు, కేవస్ రామకృష్ణారావు రచించిన ఇస్లాం ప్రవక్త మహమ్మద్ (సఅసం), యస్. ఎమ్. మలిక్ రచించిన ఆదర్శమూర్తి మహమ్మద్ (సఅసం) తదితర పుస్తకాలను జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్, నగర పీఆర్ కన్వీనర్ హాజీరా సదఫ్, సెంట్రల్ శాఖ అధ్యక్షురాలు అస్ఫియా అంజుమ్, పీఆర్ సభ్యులు ఫైజా ఇరం, సబిహా కలిసి అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనాథలు, పేదలు, బలహీనులు, అవసరంలో ఉన్నవారి పట్ల దయ, కరుణ చూపాలని బోధించారని తెలిపారు. పొరుగువారి హక్కులను గౌరవించడం, వారి హక్కులను పరిరక్షించడం, సమాజంలో పరస్పర ప్రేమ, సోదరభావం, సహకారాన్ని పెంపొందించడం వంటి విలువలకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

నగర పీఆర్ కన్వీనర్ హాజీరా సదఫ్ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావశీలులైన వ్యక్తులపై మైఖేల్ హెచ్. హార్ట్ రచించిన ది 100: ఎ ర్యాంకింగ్ ఆఫ్ ది మోస్ట్ ఇన్‌ఫ్లుయెన్షియల్ పర్సన్స్ ఇన్ హిస్టరీ పుస్తకంలో ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ప్రథమ స్థానం కల్పించారని తెలిపారు. ప్రవక్త బోధనలు, ఆయన చూపిన మార్గం ప్రపంచ చరిత్రపై చూపిన ప్రభావాన్ని ఇది తెలియజేస్తుందని అన్నారు.

సెంట్రల్ శాఖ అధ్యక్షురాలు అస్ఫియా అంజుమ్ ప్రజల మాట్లాడుతూ పట్ల జాలి, కరుణ, ఆదరణతో వ్యవహరించాలని, మాటల ద్వారా గానీ, చేతల ద్వారా గానీ ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా జీవించాలని ప్రవక్త మహమ్మద్ బోధించారని ఆమె తెలిపారు. దయ, న్యాయం, సోదరభావం, పరస్పర గౌరవం వంటి మానవతా విలువలు సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితాన్ని, ఆయన బోధించిన మానవతా విలువలను సమాజంలోని వివిధ వర్గాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాలను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం కేసులో బీఆర్ఎస్ నాయకులకు బెయిల్

- అక్రమ అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ నాయకులు




**స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం కేసులో బీఆర్ఎస్ నాయకులకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అసెంబ్లీలోకి బీఆర్ఎస్ నాయకులను అనుమతించకపోవడం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి నిరసనగా చిల్పూర్ మండలం చిన్నపెండ్యాలలో మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసన చేపట్టి దిష్టిబొమ్మ దహనం చేశారు.

ఈ ఘటనపై పోలీసులు కేసిరెడ్డి రాకేష్‌రెడ్డి, జనగం యాదగిరి, మోటం రాజు, ఎడ్ల మహిపాల్, బూర్ల రాజేశ్వర్, నారగోని రాజు, ఎడ్ల రాజేష్, లింగారెడ్డిలపై కేసు నమోదు చేశారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు వారికి బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఇల్లందుల సుదర్శన్ మాట్లాడుతూ.. కేసులకు, అరెస్టులకు బీఆర్ఎస్ భయపడదని అన్నారు. కేసులకు భయపడే పరిస్థితి ఉంటే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోలేకపోయేవారమని పేర్కొన్నారు. నాయకుల అరెస్టుల వెనుక ఎవరున్నారో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకులు జాతీయ రహదారిపై ధర్నాలు నిర్వహించి, దిష్టిబొమ్మలు దహనం చేసిన సందర్భాల్లో కేసులు ఎందుకు నమోదు చేయలేదని ఆయన ప్రశ్నించారు. పార్లమెంటులో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు నల్ల టీషర్టులు ధరించి నిరసన వ్యక్తం చేస్తే తప్పులేదు కానీ, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరిస్తే తప్పా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని, ఆ హక్కును కాలరాసే అధికారం కాంగ్రెస్ నాయకులకు ఎవరు ఇచ్చారని సుదర్శన్ విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన కేసులు, జరిగిన అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ప్రజాస్వామ్యం గెలిచిందంటూ బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొన్న రాజేష్, బలగాని అనిల్‌గౌడ్, బూర్ల విష్ణు, శీలం శ్యామ్, ఓగ్గు రాజుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

- వీర్లపల్లి శంకరయ్యపై స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీకి బీఆర్ఎస్ ఫిర్యాదు
- కేసీఆర్ పిలుపునిస్తే రేవంత్‌రెడ్డిపై చావు డప్పు మోగిస్తాం
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



**స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అమానవీయ వ్యాఖ్యలు చేయడం సరి కాదని పేర్కొంటూ శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీకి బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు.

బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. రాష్ట్రం మొత్తం రావణకాష్టాన్ని తలపించేలా అల్లకల్లోలంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిట్లర్ తరహాలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. కేసీఆర్ చస్తేనే రాష్ట్రానికి పట్టిన ఈడ విరగడవుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అమానవీయమైనవని రాజయ్య అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి రానివ్వకుండా అడ్డుకోవడం, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులకు పోలీసు భద్రత కల్పించడం అధికార పార్టీ పిరికిపంద చర్యలకు నిదర్శనమని ఆరోపించారు. బీజేపీ సభ్యులు రికార్డులతో అసెంబ్లీలోకి వస్తే అనుమతించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని ఆరోపిస్తూ, తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని, వీర్లపల్లి శంకరయ్యపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

“కేసీఆర్ పిలుపునిస్తే రేవంత్‌రెడ్డిపై చావు డప్పు మోగిస్తాం” అని రాజయ్య వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి బెదిరింపులకు భయపడరని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, కౌన్సిలర్లు తాటికొండ మధు, పొన్న రాజేష్, చల్ల రమ్య-రఘురెడ్డి, తాటికొండ సురేష్, శీలం శ్యామ్, గట్టు కృష్ణ సాయి, కనకం గణేష్, నాగపురి పావని, మారేపల్లి ప్రసాద్, గుండె మల్లేష్, కుందూరు జ్యోతి రెడ్డి, మారేడుపాక రమాదేవి, కూరపాటి కవిత-యాదగిరి, గుర్రం చిట్టిబాబు, గుర్రం శంకర్, హీరాసింగ్, చింత శ్రీనివాస్, గుండె రంజిత్, గాదె రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సర్పంచ్ బిల్లా యాదగిరి



**వేలేరు, సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ బిల్లా యాదగిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులకు సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలో మొత్తం 328 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని కోరారు.

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. భోజనం బాగానే ఉందని విద్యార్థులు సర్పంచ్‌కు తెలిపారు.

వంట సిబ్బంది సేవలను అభినందించిన సర్పంచ్ బిల్లా యాదగిరి, అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, ప్రధానోపాధ్యాయులు సత్యం, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాళోజి ఆశయాలే తెలంగాణకు స్ఫూర్తి.. బీఆర్ఎస్ నేతల ఘన నివాళి



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మండల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు మండల సురేందర్ ఆధ్వర్యంలో ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మండల సురేందర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ఆత్మగౌరవానికి, అన్యాయంపై తిరుగుబాటుకు నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. అక్షరాన్ని ఆయుధంగా మలచి తెలంగాణ మాండలిక భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యోధుడు కాళోజి అని అన్నారు. “పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది” అనే ఆయన సందేశం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళోజీకి తగిన గుర్తింపునిచ్చిందని, వరంగల్‌లోని హెల్త్ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడంతో పాటు కాళోజి కళాక్షేత్రాన్ని నిర్మించి ఆయన జ్ఞాపకాలను చిరస్మరణీయం చేసిందని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని, పాలకులను ప్రశ్నించే గొంతుకగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మార్పాటి మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సల్పాల తిరుపతి, మండల నాయకులు కండె సుధాకర్, గుడికందుల రాజు, అంబాల చక్రపాణి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి.!




**దమ్మపేట, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు):** అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్తున్న అంగన్వాడీ ఉద్యోగులను, అక్కడ ఆందోళన చేస్తున్న రాష్ట్ర నాయకత్వాన్ని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ మురారి రఘు మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగులు అధిక పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నా.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచలేదన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎంసీ, ప్రీప్రైమరీ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, సెంటర్ హద్దులు, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సూరమ్మ, జయ, వెంకటలక్ష్మి, సీతారామమ్మ, వజ్రమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరులో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



**సత్తుపల్లి, సెప్టెంబరు 9 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సత్తుపల్లి మండలం కొత్తూరులో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న పథకాలు, వాటి ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, కొత్తూరు గ్రామ సర్పంచ్, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 327 ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దండెబోయిన ఐలయ్య యాదవ్




**స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)327 (ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ) జిల్లా, డివిజన్ స్థాయి ఎన్నికలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని ఫతేపూర్‌లో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న దండెబోయిన ఐలయ్య యాదవ్‌ను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
అనంతరం ఐలయ్య యాదవ్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఇనుగాల శ్రీధర్‌కు ఐలయ్య యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు, జిల్లా కార్యదర్శి చెట్టుపల్లి నరేందర్‌రెడ్డి, జిల్లా సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూసాని రాజ్‌కుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని ఐలయ్య యాదవ్ పేర్కొన్నారు.

# స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.!

- **ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి.**
- **ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్.**




**సత్తుపల్లి, సెప్టెంబరు 9 (తెలంగాణ ముచ్చట్లు):** స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ సత్తుపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జేవీఆర్ కళాశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.11 వేల కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు భాను శ్రీకర్ మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సత్తుపల్లి ఉమెన్స్ జూనియర్ కళాశాల ప్రహరీ గోడ కూలిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ప్రవీణ్ హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నేత కొలికపోగు సర్వేశ్వరరావు, నవీన్, రామ్‌చరణ్, దీపు, చరణ్, పవన్, మణికంఠ, గౌతమి, త్రిపుర, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- **బాలికలు క్రీడల్లో మరింతగా రాణించాలి-మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు బాలికలను క్రీడల వైపు ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్ కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా జరిగింది. ఈ పోటీలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.
ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.
ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖేలో ఇండియా-అస్మిత వంటి కార్యక్రమాలను యువ క్రీడాకారులు, ముఖ్యంగా బాలికలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమాల లక్ష్యమన్నారు.
కరీంనగర్ జిల్లాలో రగ్బీ అభివృద్ధికి కృషి చేస్తున్న రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులను మేయర్ అభినందించారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ శివకృష్ణ, పెద్దపల్లి జిల్లా సెక్రటరీ రామకృష్ణ, సిద్దిపేట జిల్లా సెక్రటరీ అజయ్, రాజన్నసిరిసిల్ల జిల్లా సెక్రటరీ హనుమంతు, జగిత్యాల జిల్లా సెక్రటరీ మహిపాల్, వెంకటేశ్వర హాస్పిటల్ అడ్మిన్ వెంకటేశ్వర్లు, రగ్బీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీకి ఘన నివాళులు

- **కాళోజీకి ఘన నివాళులుపూలమాలవేసిన చైర్‌పర్సన్ సుహాసిని**



**హుజూరాబాద్,సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ప్రజాకవి, ప్రజా ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు ఘన నివాళులు అర్పించారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.
ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్‌రావు మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచారని అన్నారు. తన రచనలు, కవితలు, వ్యాసాల ద్వారా సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలను ఎత్తిచూపుతూ సామాజిక చైతన్యానికి కృషి చేశారని కొనియాడారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన కాళోజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.
తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానంపై కాళోజీకి ఎంతో అభిమానం ఉండేదని తెలిపారు. సామాన్య ప్రజల కష్టాలు, బాధలు, ఆకాంక్షలను తన సాహిత్యంలో ప్రతిబింబించిన గొప్ప ప్రజా కవిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణ సమాజంలో చైతన్యం తీసుకురావడంలో కాళోజీ రచనలు కీలక పాత్ర పోషించాయని చెప్పారు.
ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం కాళోజీ నారాయణరావు చేసిన కృషిని నేటి తరం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాళోజీ ప్రజా సేవలు, సాహిత్య కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు షూస్, సాక్స్ పంపిణీ

- **ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి**



**సైదాపూర్ ,సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు సమకూర్చిన షూస్, సాక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై చదువుల్లో రాణించడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.
విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాఠశాలల్లో వివిధ సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. అందులో భాగంగానే విద్యార్థులకు షూస్, సాక్స్ అందజేయడం జరిగిందన్నారు. వీటిని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ వేముల శ్రీకాంత్, ఉపసర్పంచ్ శ్రీ కొంకట పవన్, పాఠశాల సముదాయాల హెడ్‌మాస్టర్ శ్రీ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు షూస్, సాక్స్ అందజేసి వారిని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు.

# అంగన్‌వాడీల ముందస్తు అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్



**పెద్దమందడి,సెప్టెంబర్09(తెలంగాణ ముచ్చట్లు):** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్తున్న అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని పెద్దమందడి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. అంగన్‌వాడీల శాంతియుత నిరసనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.వనపర్తి జిల్లా పెద్దమందడి మండలానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులు తెల్లవారుజామునే ముందస్తుగా అదుపులోకి తీసుకున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న అంగన్వాడి మహిళలను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్దమందడి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవరాత్రి వేడుకల్లో అప్రమత్తంగా ఉండాలి!

- **నిర్వాహకులదే పూర్తి బాధ్యత**
- **ఏసీపీ మాధవి సూచనలు**




**వీణవంక, సెప్టెంబర్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఏసీపీ మాధవి సూచించారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలో నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులకు పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల ప్రాధాన్యతను వివరించారు. వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాలని సూచించారు.
ముఖ్యంగా విద్యుత్ ఏర్పాట్లలో నిర్లక్ష్యం చేయకూడదని, ఊరేగింపుల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిబంధనలు పాటిస్తూ నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు.
కార్యక్రమంలో సీఐ వెంకట్, ఎస్సై తిరుపతి, ఉత్సవాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రైతులకు అన్నివేళలా అండగా మార్కెట్ ఉండాలి



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సకాలంలో అందిస్తూ జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ అన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో రైతులు వస్తుంటారని తెలిపారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలతో పాటు అవసరమైన సేవలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వం ప్రకటిస్తున్న గిట్టుబాటు ధరలు రైతులకు అందేలా అధికారులు, మార్కెట్ పాలకవర్గం సమన్వయంతో పనిచేయాలని అన్నారు. మార్కెట్ చైర్మన్, కార్యదర్శి, డైరెక్టర్లు రైతులతో నిత్యం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. రైతుల సంక్షేమమే మార్కెట్ కమిటీ ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

సమావేశంలో మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి మల్లేశం, డైరెక్టర్లు కందాల తిరుపతి, గడ్డం దీక్షిత్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దళిత సమాజం ప్రశ్నించాలి.. పార్టీల జెండాల కింద బానిసలుగా మారొద్దు

- డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్

**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 9 ( తెలంగాణ ముచ్చట్లు):** దళిత సమాజం తమపై జరుగుతున్న అన్యాయాలు, అవమానాలపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, రాజకీయ పార్టీల జెండాల కింద బానిసలుగా మారవద్దని డీహెచ్‌పీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్ అన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించిన ఆయన, ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించిన ఎమ్మెల్సీపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దళితులపై దాడులు, అవమానాలు జరిగినప్పుడు గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్న దళిత సంఘాల నాయకులు మౌనం వహించడం సరికాదన్నారు. దళితుల సమస్యలపై స్పందించాల్సిన నాయకులు రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తే ప్రజల్లో సంఘాలపై నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

అంబేద్కర్ ఆశయాలను కేవలం ప్రసంగాలకు, రాజకీయ అవసరాలకు పరిమితం చేయకుండా ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక వివక్ష, అవమానాలకు వ్యతిరేకంగా దళిత సమాజం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దళితులపై జరుగుతున్న దాడులు, అవమానాలను ఎప్పటికప్పుడు ఖండించడంతో పాటు, బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మనోహర్ కోరారు. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ తాత మధును వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి శనిగరపు రాజకుమార్, ఆరెపల్లి చంద్రమౌళి, ఎర్ర సత్యం తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే విద్యార్థుల్లో సమగ్ర వికాసం

- జమ్మికుంట ప్రభుత్వ బాలుర పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ క్రీడా పోటీలను ప్రారంభించి విద్యార్థులను ఉత్సాహపరిచారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదిగిన విద్యార్థులకు అనేక అవకాశాలు లభిస్తాయని, క్రీడా సర్టిఫికెట్ల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ పాఠశాలలో చదివిన పలువురు విద్యార్థులు క్రీడా ప్రతిభతో మంచి స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు.

క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. పోటీల్లో పాల్గొంటున్న ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో మండల విద్యాధికారి హేమలత, ఎస్ఐ రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు ప్రేమలత, వి.శ్రీలత, రేణుక, ప్రవీణ్, శ్రీను, భగత్ తదితరులు పాల్గొన్నారు.

# చదివిన బడికి.. రూ.30 వేల విలువైన మైక్ సెట్ కానుక!

- పూర్వ విద్యార్థులుగా పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ కందికట్ల మధుసూదన్, కూతురు శంకర్ చేయూత



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందించిన చేయూతకు మరోసారి నిదర్శనంగా నిలిచారు కోరపల్లి సర్పంచ్ కందికట్ల మధుసూదన్, పూర్వ విద్యార్థి కూతురు శంకర్. జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కాళోజి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలకు రూ.30 వేల విలువైన మైక్ సెట్‌ను విరాళంగా అందజేశారు.

గతంలో ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్ కందికట్ల మధుసూదన్, పూర్వ విద్యార్థి కూతురు శంకర్ కలిసి మైక్ సెట్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో పాఠశాలకు అందించారు. దీంతో పాఠశాల కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

ఈ సందర్భంగా సర్పంచ్ మధుసూదన్ మాట్లాడుతూ తాను కూడా ఇదే పాఠశాలలో విద్యనభ్యసించానని తెలిపారు. తనకంటే సీనియర్ అయిన పూర్వ విద్యార్థి కూతురు శంకర్‌తో కలిసి పాఠశాలకు మైక్ సెట్ అందించడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలో అవసరమైన సౌకర్యాలను గుర్తించి ఇతర పూర్వ విద్యార్థులు కూడా స్పందించి తమ వంతు సహకారం అందించాలని కోరారు. రెండోసారి సర్పంచ్‌గా తనను గెలిపించిన కోరపల్లి గ్రామ ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దళితబంధు నిధుల విడుదలకు త్వరలో మార్గం

- పెండింగ్ నిధులు మంజూరు చేస్తామని ప్రణవ్ బాబు హామీ
- దళితుల ఆత్మగౌరవ సభ విజయవంతం



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** దళితబంధు లబ్ధిదారుల పెండింగ్ నిధులను త్వరలో మంజూరు చేయిస్తామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు హామీ ఇచ్చారని దళితబంధు సాధన సమితి నాయకులు తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని ఎంఫీఆర్ గార్డెన్‌లో బుధవారం దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో దళితుల ఆత్మగౌరవ సభను ఘనంగా నిర్వహించారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దళితబంధు నిధుల మంజూరు ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయిందని, అప్పటి నుంచి లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొందని నాయకులు తెలిపారు. ఈ సమస్యపై దళితబంధు సాధన సమితి హుజూరాబాద్ నియోజకవర్గ నాయకులు ప్రణవ్ బాబును కలిసి నిధుల విడుదలపై చర్చించగా, పెండింగ్‌లో ఉన్న నిధులను తప్పకుండా మంజూరు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సాధన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి కొలుగూరి నరేష్ మాట్లాడుతూ ప్రణవ్ బాబు హామీతో నియోజకవర్గంలోని దళితబంధు లబ్ధిదారులకు త్వరలో నిధులు అందుతాయనే నమ్మకం కలిగిందన్నారు. దళితుల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి ఈ హామీ నిదర్శనమని పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ దళితబంధు సాధన సమితి తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిలా మహేష్, నియోజకవర్గ నాయకులు కోడెపాక రక్షిత్, అకినపల్లి ఆకాష్, ఇనుగాల భిక్షపతి, గాజుల కుమార్, సరిగొమ్ముల విజయ్, అకినపల్లి జయ, జీడి అరుణ, సరిత, సౌజన్య, శాంతన్, అంబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విజయమే లక్ష్యంగా.. మైదానంలో యువ క్రీడాకారుల పోరాటం

- -ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్‌లో హోరాహోరీ పోటీలు



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో 70వ మండల స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య క్రీడా ఎంపికలు బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.

ఈ ఎంపికల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. మైదానంలో విద్యార్థులు గెలుపే లక్ష్యంగా ఉత్సాహంతో పోటీపడుతూ క్రీడాస్ఫూర్తిని చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తదుపరి స్థాయి జిల్లా క్రీడా ఎంపికలకు ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలతో పాటు సమిష్టి భావన పెంపొందుతాయని తెలిపారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకుని నిరంతరం సాధన చేయాలని సూచించారు.

క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని అన్నారు. ఎల్కతుర్తి మండలానికి మంచి పేరు తీసుకువచ్చేలా విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్కతుర్తి సర్పంచ్ మునిగడప లావణ్య శేషు, ఉపసర్పంచ్ గుడిశాల రాజు హాజరయ్యారు. గౌరవ అతిథులుగా విజయ్‌కుమార్, ఎంపీడీవో బి. కిషన్‌రావు, గోపాల్‌పూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీసీ తెరిస్, కార్మెల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. ధనలక్ష్మి, హెచ్‌సీఎఫ్ కార్యదర్శి టి. రాములు పాల్గొన్నారు.

అలాగే సుధాకర్, ప్రేమ్ ప్రసాద్, స్వరూప, ప్రభావతి, శ్రీకాంత్, ఉదయ్, తిరుపతి, పూర్ణిమ, ఉషారాణి, కిరణ్‌రావు, స్వరూప తదితర వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని క్రీడా ఎంపికలను విజయవంతంగా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ తదుపరి స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# దామెరలో విద్యుత్ కష్టాలు.. అధికారుల నిర్లక్ష్యం ఇంకెన్నాళ్లు?

- బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్

**ఎల్కతుర్తి సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్య కారణంగా గ్రామ ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

దామెర గ్రామానికి ప్రస్తుతం 33 కిలోవోల్టుల విద్యుత్ సరఫరా జరుగుతున్నప్పటికీ, ప్రత్యామ్నాయ విద్యుత్ మార్గం లేకపోవడంతో చిన్నపాటి సాంకేతిక సమస్య తలెత్తినా మొత్తం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. దీంతో తాగునీటి సరఫరా, విద్యార్థుల చదువులు, వ్యాపారాలు, ప్రజల రోజువారీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా రైతులకు మూడు దశల విద్యుత్ సరఫరా సక్రమంగా అందకపోవడంతో పంటలకు నీరు అందించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ అంతరాయాలతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



విద్యుత్ సమస్య పరిష్కారం కోసం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసినట్లు శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. దామెర గ్రామానికి 33 కిలోవోల్టుల ప్రత్యామ్నాయ విద్యుత్ మార్గాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు మూడు దశల విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

అధికారులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే స్పందించాలని, ప్రత్యామ్నాయ విద్యుత్ మార్గం ఏర్పాటుకు సర్వే, అంచనాలు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను నివారించి రైతులకు సక్రమంగా విద్యుత్ అందించాలని కోరారు.

పంటలు ఎండిపోయిన తర్వాత పరిహారం కోసం పరుగులు పెట్టించే పరిస్థితి కాకుండా, పంటలు చేతికొచ్చే వరకు అవసరమైన విద్యుత్ అందేలా ఇప్పుడే చర్యలు చేపట్టాలని మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ స్పష్టం చేశారు. దామెర గ్రామ ప్రజలు, రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లెపాటి మాధవరావు, ప్రధాన కార్యదర్శులు చిరురాల వెంకటేష్, అల్లి కుమార్, కార్యదర్శి కోడెం రమేష్, జిల్లా రైతు విభాగం కార్యవర్గ సభ్యుడు తక్కలపల్లి సంపత్ రావు, సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, జనానికిష్టయ్య, ఆడెపు శ్రీ వర్ధన్, సల్పాల కిరణ్, ఠాకూర్ శాంసింగ్, చీరాల రంజిత్, మాధవరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# తీగలతండాలో ఘనంగా బోనాలు

- **డప్పుచప్పుళ్లు.. శివసత్తుల శిగాలు.. డీజే పాటలతో సందడి**
- **పోచమ్మ తల్లికి బోనాలతో మహిళల మొక్కులు**

**స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రావణమాసం ముగుస్తున్న సందర్భంగా చిల్పూర్ మండలంలోని తీగలతండాలో బోనాల పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అందంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లికి సమర్పించారు.బోనాల ఊరేగింపులో డప్పుచప్పుళ్లు, శివసత్తుల శిగాలు, డీజే పాటలతో తండాలో సందడి వాతావరణం నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ బోనాల వేడుకల్లో గ్రామ సర్పంచ్ తీగల సంబరాజు యాదవ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను అక్షరాల్లో ఆవిష్కరించిన మహాకవి

- **ప్రజాకవి కాళోజీ జయంతి.. తెలంగాణ ఆత్మను గుర్తుచేసే రోజు**
- **తెలంగాణ భాషా దినోత్సవంగా అధికారిక నిర్వహణ**
- **ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన వ్యక్తిత్వం**




**డెస్క్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9న ఘనంగా నిర్వహిస్తారు. తెలంగాణ సాహిత్యం, సంస్కృతి, ప్రజా ఉద్యమాల చరిత్రలో చెరగని ముద్ర వేసిన కాళోజీ 1914 సెప్టెంబర్ 9న జన్మించారు. ఆయన జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా అధికారికంగా జరుపుతూ భాషా, సాహిత్య రంగాలకు విశిష్ట గౌరవాన్ని అందిస్తోంది. ప్రజల జీవితాలను, వారి సమస్యలను, భావోద్వేగాలను తన రచనల్లో ప్రతిబింబించిన కాళోజీ తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కాళోజీ నారాయణరావు కేవలం కవి మాత్రమే కాదు, సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా ఉద్యమకారుడు కూడా. నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఆయన జీవితమంతా సామాజిక చైతన్యానికి అంకితమైంది. అన్యాయం, అసమానత, దోపిడీపై తన కలంతో పోరాడిన కాళోజీ ప్రజల గొంతుకగా గుర్తింపు పొందారు.

తెలంగాణ మాండలిక భాషకు సాహిత్య గౌరవాన్ని తీసుకొచ్చిన ప్రముఖుల్లో కాళోజీ ఒకరు. ఆయన రచనలు పాండిత్య ప్రదర్శనకు కాకుండా ప్రజల మనసులను తాకే సరళమైన భాషలో ఉండేవి. సాధారణ ప్రజల మాటలను కవిత్వంగా మలచి సాహిత్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేశారు. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాలను తన రచనల ద్వారా సజీవంగా నిలిపారు. అందుకే ఆయనను తెలంగాణ ఆత్మగా పలువురు అభివర్ణిస్తారు. కాళోజీ రచించిన "నా గొడవ" తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట రచనగా గుర్తింపు పొందింది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ఆయన వ్యక్తం చేసిన ఆవేదన, ప్రజల పట్ల చూపిన నిబద్ధత ఈ రచనలో స్పష్టంగా కనిపిస్తాయి. కవిత్వాన్ని ప్రజల సమస్యలకు అద్దంగా ఉపయోగించిన కాళోజీ, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలిచారు. ఆయన రచనలు నేటికీ పాఠకులను ఆలోచింపజేస్తూనే ఉన్నాయి.

సాహిత్యం, సమాజ సేవ రంగాల్లో చేసిన విశేషకృషికి గాను భారత ప్రభుత్వం కాళోజీకి పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. అనేక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నప్పటికీ ఆయన జీవితాంతం నిరాడంబరంగానే గడిపారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి స్వరం వినిపించడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. ప్రజా జీవితానికి అంకితమైన ఆయన వ్యక్తిత్వం అనేక తరాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. కాళోజీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యాసంస్థలు, సాహిత్య సంఘాలు, సామాజిక సంస్థలు ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రత్యేక సభలు నిర్వహిస్తాయి. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా భాషా పరిరక్షణ, మాతృభాష ప్రాధాన్యంపై చర్చలు జరుగుతాయి. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి కేవలం ఒక మహానుభావుడి జన్మదినం మాత్రమే కాదు, ప్రజల పక్షాన నిలిచిన ఒక గొప్ప వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకునే సందర్భంగా నిలుస్తోంది.

# కేసు నమోదు చేయాలని చింతకాని పోలీసులకు టీఆర్ఎస్ నేతల వినతి




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ తొలి మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్)పై బహిరంగంగా మరణాన్ని కోరుతూ వ్యాఖ్యలు చేసిన షాదీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శంకరయ్యతో పాటు తెలంగాణకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ చింతకాని మండల టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీసులకు వినతిపత్రం సమర్పించారు. మధిర టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కమల్‌రాజు ఆదేశాల మేరకు బుధవారం చింతకాని మండల పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఒక మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతపై బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని నాయకులు పేర్కొన్నారు. సంబంధిత వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు నాయకులు మంకెన రమేష్, నాగులవంచ పీఏసీఎస్ డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య, మాజీ చింతకాని ఎంపీపీ పోనుగోటి రత్నాకర్, మాజీ టీఆర్ఎస్ మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మండల రైతుబంధు నాయకులు గడ్డం శ్రీనివాసరావు, పాతర్లపాడు టీఆర్ఎస్ నాయకులు తుమ్మలపల్లి శ్రీనివాసరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్లూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్





**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 9(తెలంగాణ ముచ్చట్లు ):** నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.

బుధవారం కల్లూరు పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా, ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్దేశిత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి, నేరస్తులకు చట్టపరంగా శిక్ష పడేలా పటిష్టమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తీవ్రమైన నేరాలు, మహిళలు మరియు బాలలపై జరిగే నేరాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ రవాణా, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు నాణ్యత, సిబ్బంది విధుల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో సమర్థవంతంగా పని చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ సేవల్లో భద్రతా లోపాలు

- **నోయిడాలో మహిళను వేధించిన డెలివరీ రైడర్**
- **వ్యక్తిగత డేటా దుర్వినియోగంపై ఆందోళనలు**
- **వ్యక్తిగత నంబర్‌కు అసభ్యకర సందేశాలు**
- **డేటా గోప్యత, భద్రతపై దేశవ్యాప్తంగా ఆందోళన**



**డెస్క్, 9 సెప్టెంబర్ (తెలంగాణ ముచ్చట్లు)** : ఆన్‌లైన్ డెలివరీ, రైడ్ సేవలను వినియోగిస్తున్న మహిళల భద్రతపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఓ పార్శిల్ డెలివరీ రైడర్ మహిళ వ్యక్తిగత మొబైల్ నంబర్‌కు అసభ్యకర సందేశాలు పంపిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పార్శిల్ డెలివరీ పూర్తయిన తర్వాత కూడా వినియోగదారుల వ్యక్తిగత వివరాలు దుర్వినియోగం అవుతున్నాయనే ఆందోళనలను ఈ ఘటన మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది.

వివరాల ప్రకారం, నోయిడాకు చెందిన ఓ మహిళ ఆన్‌లైన్ ద్వారా పార్శిల్ డెలివరీ సేవను బుక్ చేసుకుంది. డెలివరీ పూర్తయిన అనంతరం సంబంధిత రైడర్ ఆమె వాట్సాప్ నంబర్‌కు వ్యక్తిగత సందేశాలు పంపుతూ వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. మహిళ హెచ్చరించినప్పటికీ రైడర్ నిర్లక్ష్యంగా స్పందించి ఫిర్యాదు చేసుకోవచ్చంటూ సవాల్ విసిరినట్లు సమాచారం. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విస్తృత చర్చకు దారితీసింది.

ఈ ఘటనతో ఆన్‌లైన్ సేవల సంస్థల వద్ద భద్రపరచబడుతున్న వినియోగదారుల వ్యక్తిగత సమాచారం ఎంత సురక్షితంగా ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫోన్ నంబర్లు, చిరునామాలు వంటి వివరాలు సేవల నిర్వహణ కోసం మాత్రమే వినియోగించాల్సి ఉండగా, వాటి దుర్వినియోగం మహిళల్లో భయాందోళనలకు కారణమవుతోంది. డేటా రక్షణకు సంబంధించి మరింత కఠినమైన విధానాలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.


ఇటీవలి కాలంలో ఇదే తరహా సంఘటనలు పలు నగరాల్లో వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తోంది. మహిళలకు అసభ్యకర సందేశాలు పంపడం, వ్యక్తిగత ప్రశ్నలు అడగడం, ప్రయాణం అనంతరం సంప్రదించడం వంటి ఆరోపణలు పలుమార్లు నమోదయ్యాయి. కొన్ని సందర్భాల్లో మహిళల భద్రతకు ముప్పు కలిగించే పరిస్థితులు కూడా ఎదురైనట్లు వార్తలు వెలువడ్డాయి.

మహిళల భద్రత విషయంలో రవాణా, డెలివరీ సేవల సంస్థలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సామాజిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. డ్రైవర్లు, డెలివరీ సిబ్బందిపై కఠిన ధృవీకరణ ప్రక్రియలు అమలు చేయడంతో పాటు వినియోగదారుల వివరాలకు పరిమిత ప్రాప్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఘటనపై స్పందించిన సంబంధిత సంస్థ, మహిళ ఫిర్యాదును అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. మహిళల భద్రత, గౌరవం తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొంటూ అవసరమైన వివరాలను అందించాలని కోరింది. ఈ ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా మహిళల భద్రత, డేటా గోప్యతపై మరింత చర్చ జరుగుతోంది.

# సెలబ్రిటీ సంస్కృతి యువతను ఎంతవరకు ప్రభావితం చేస్తోంది?

- **సామాజిక మాధ్యమాల యుగంలో సెలబ్రిటీల ప్రభావం**
- **ఫ్యాషన్, జీవనశైలిపై పెరుగుతున్న అనుకరణ**



**డెస్క్, సెప్టెంబర్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రస్తుత కాలంలో సెలబ్రిటీ సంస్కృతి సమాజంపై, ముఖ్యంగా యువతపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. సినిమా నటులు, క్రీడాకారులు, గాయకులు, సామాజిక మాధ్యమాల ప్రముఖులు యువతకు ఆదర్శంగా మారుతున్నారు. ఒకప్పుడు సెలబ్రిటీల గురించి తెలుసుకోవడానికి పత్రికలు, టెలివిజన్ మాత్రమే ఉండగా, ఇప్పుడు ప్రతి క్షణం వారి జీవిత విశేషాలు ప్రజల ముందుకు వస్తున్నాయి. ఈ నిరంతర ప్రచారం యువతలో వారి పట్ల ఆకర్షణను మరింత పెంచుతోంది. ఫలితంగా సెలబ్రిటీల అభిప్రాయాలు, అలవాట్లు, జీవనశైలి, దుస్తులు, ప్రవర్తన వంటి అంశాలు యువత నిర్ణయాలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతున్నాయి. సామాజిక మాధ్యమాల విస్తరణతో సెలబ్రిటీ సంస్కృతి కొత్త రూపాన్ని సంతరించుకుంది. ప్రముఖులు తమ వ్యక్తిగత జీవితాలను కూడా అభిమానులతో పంచుకుంటున్నారు. దీంతో యువత వారికి మరింత దగ్గరైన భావన కలిగి ఉంటుంది. వారు ప్రచారం చేసే ఉత్పత్తులు, అభిప్రాయాలు, జీవన విధానాలు వేగంగా యువతలోకి చేరుతున్నాయి. ఒక సెలబ్రిటీ ఉపయోగించే వస్తువు, ధరించే దుస్తులు, అనుసరించే పద్ధతులు ట్రెండ్‌గా మారుతున్నాయి. ఈ పరిస్థితి యువతలో స్వతంత్ర ఎంపికల కంటే అనుకరణ ధోరణిని పెంచుతున్నదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఫ్యాషన్ రంగంలో సెలబ్రిటీల ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తుంది. కొత్త దుస్తుల శైలి, జుట్టు కత్తిరింపు విధానం, అలంకరణ పద్ధతులు సెలబ్రిటీల ద్వారా ప్రజాదరణ పొందుతున్నాయి. యువత తమ అభిమాన నటులు లేదా క్రీడాకారులను అనుసరించడానికి ఆసక్తి చూపుతోంది. కొన్నిసార్లు ఈ ప్రభావం సృజనాత్మకతను పెంచినా, మరి కొన్ని సందర్భాల్లో అనవసర ఖర్చులకు దారితీస్తోంది. సామర్థ్యానికి మించి ఖర్చు చేసి ఒక ప్రత్యేక జీవనశైలిని అనుసరించాలనే ప్రయత్నం యువతలో ఆర్థిక ఒత్తిడికి కూడా కారణమవుతోంది.

సెలబ్రిటీ సంస్కృతికి సానుకూల కోణాలు కూడా ఉన్నాయి. అనేక మంది ప్రముఖులు విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. వారి ప్రభావంతో మంచి కార్యక్రమాలకు ప్రజల మద్దతు పెరుగుతోంది. క్రీడాకారుల విజయాలు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచుతాయి. కొంతమంది ప్రముఖుల క్రమశిక్షణ, కృషి, పట్టుదల యువతకు ప్రేరణగా నిలుస్తాయి. విజయాన్ని సాధించాలంటే కష్టపడాల్సిందే అనే సందేశాన్ని వారి జీవితాలు అందిస్తాయి.

అయితే ప్రతికూల ప్రభావాలను కూడా విస్మరించలేం. కొందరు యువత సెలబ్రిటీలను ఆదర్శంగా కాకుండా ఆరాధన స్థాయికి తీసుకెళ్తున్నారు. వ్యక్తిగత అభిరుచులు, లక్ష్యాలు, విలువల కంటే అభిమాన హీరో లేదా ప్రముఖుడి అభిప్రాయాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది స్వతంత్ర ఆలోచనలను దెబ్బతీయవచ్చు. కొన్నిసార్లు ప్రముఖుల వ్యక్తిగత వివాదాలు, అనుచిత ప్రవర్తన కూడా యువతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతి విషయాన్ని విమర్శనాత్మక దృష్టితో పరిశీలించే అలవాటు అవసరం. సామాజిక మాధ్యమాల్లో కనిపించే సెలబ్రిటీల జీవితం పూర్తిస్థాయి వాస్తవం కాదనే విషయాన్ని యువత గుర్తించాలి. అక్కడ చూపించే విలాసవంతమైన జీవితం వెనుక ఎన్నో సవాళ్లు, కష్టాలు ఉంటాయి. కానీ చాలామంది యువత ఆ మెరుపులను మాత్రమే చూసి తమ జీవితాలతో పోల్చుకుంటారు. దీని వల్ల అసంతృప్తి, ఆత్మవిశ్వాస లోపం, నిరాశ వంటి సమస్యలు తలెత్తవచ్చు. ప్రతి వ్యక్తి పరిస్థితులు వేరు అనే అవగాహన పెరగాలి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రజాకవి కాళోజీకి ఘన నివాళులు అర్పించిన కేటీఆర్

- తెలంగాణ భవన్‌లో కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి
- కాళోజీ ఆశయాలు తరతరాలకు స్ఫూర్తి కావాలని ఆకాంక్ష
- పాల్గొన్న కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. కాళోజీ తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి, ప్రజా చైతన్యానికి చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ ఆత్మను తన రచనల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు కాళోజీ అని కేటీఆర్ పేర్కొన్నారు. సామాన్య ప్రజల సమస్యలు, సామాజిక విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని తన రచనల్లో ప్రతిబింబించిన కాళోజీ భావజాలం నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో పాటు మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కాళోజీ సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ఆయనకు దక్కిన గొప్ప గౌరవమని పేర్కొంటూ, తెలంగాణ భాషా వైభవాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

# ఆయుష్ విద్యార్థులకు డబుల్ స్టైఫండ్

- హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లు భారీగా పెంపు
- జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వారి స్టైఫండ్లను దాదాపు రెట్టింపు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచగా, పీజీ విద్యార్థుల స్టైఫండ్‌ను రూ.34,385 నుంచి రూ.74,482కు పెంచింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేసిన ఆయుష్ విద్యార్థులు, వైద్యులు బుధవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీవో ప్రతిని విద్యార్థులకు అందజేశారు.

గత పదేళ్లలో తమ స్టైఫండ్లు ఒక్కసారి కూడా పెరగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నామని విద్యార్థులు తెలిపారు. ప్రస్తుతం అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెరగడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహలకు కృతజ్ఞతలు తెలిపారు.bఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదిగి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. విద్య కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా సమాజంలో గుణాత్మక మార్పుకు పునాది కావాలని అన్నారు. యువతే దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు.

గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల్లో 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి బోధనా వ్యవస్థను బలోపేతం చేశామని వివరించారు. సిద్ధిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కరీంనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో మరో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లను దశలవారీగా అభివృద్ధి చేస్తూ మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆయుష్ వైద్య విధానాలపై పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాలని యువ వైద్యులకు పిలుపునిచ్చారు.

# మట్టి గణపతుల పంపిణీలో కవిత

- తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కార్యక్రమం
- పర్యావరణహిత వినాయక ఉత్సవాలకు ప్రోత్సాహం
- కార్యక్రమాన్ని ప్రారంభించిన కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రక్షణ సేన నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణహిత వినాయక ఉత్సవాలపై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను వినియోగించడం ద్వారా చెరువులు, జలాశయాలను కాలుష్యం నుంచి కాపాడవచ్చని పేర్కొన్నారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూనే ప్రకృతిని సంరక్షించే బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలని ఆమె సూచించారు. మట్టి విగ్రహాల వినియోగం పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుందని తెలిపారు. ప్రజల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు తెలంగాణ రక్షణ సేన పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. అందులో భాగంగానే మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

పర్యావరణహిత పండుగల నిర్వహణకు యువత ముందుండాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మట్టి గణపతుల వినియోగాన్ని విస్తృత స్థాయిలో ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఐడీఎల్ చెరువులో నిమజ్జన ఏర్పాట్లు

- గణేష్ నిమజ్జనానికి హైడ్రా చర్యలు
- 20 అడుగుల మేర పూడిక తొలగింపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువులో గణేష్ నిమజ్జనాలు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించేందుకు హైడ్రా ప్రత్యేక చర్యలు చేపట్టింది. వేల సంఖ్యలో తరలివచ్చే వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువుగా చెరువులో నీటి మట్టాన్ని పెంచేందుకు, లోతు పెంచేందుకు అధికారులు ముమ్మరంగా పనులు నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారి వైపు చెరువును లోతుగా తవ్వి నీటితో నింపే ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువులో సుమారు 20 అడుగులకు పైగా పేరుకుపోయిన పూడికను తొలగించే పనులు కొనసాగుతున్నాయి. పూడిక తొలగింపుతో పాటు ఊట నీరు వెలువడుతుండగా, అదనంగా మంచినీటిని నింపేందుకు కూడా చర్యలు చేపడుతున్నారు. వ్యర్థజలాలు చేరకుండా, నిమజ్జనానికి తగిన నీటి నిల్వలు ఉండేలా ప్రత్యేక ప్రణాళికతో పనులు నిర్వహిస్తున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇప్పటికే ఐడీఎల్ చెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించారు. చెరువు పునరుద్ధరణ పనులకు ఆటంకం కలగకుండా, అదే సమయంలో గణేష్ నిమజ్జనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కూడా నిమజ్జన ఏర్పాట్లపై హైడ్రాకు విజ్ఞప్తి చేశారు. చెరువులో తవ్వకాలు చేపడుతున్న కొద్దీ భారీగా వ్యర్థాలు బయటపడుతున్నాయని అధికారులు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అవశేషాలు, కొబ్బరి పీచు, చెత్తతో పాటు మురుగు ద్వారా చేరిన పదార్థాలు పెద్ద ఎత్తున వెలికితీయబడుతున్నాయి. ఈ వ్యర్థాలు దశాబ్దాలుగా చెరువు అడుగుభాగంలో పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతిన్నట్లు గుర్తించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పదార్థాలు నీటిలో కలిసిన తర్వాత చెరువు అడుగుభాగంలో పేరుకుపోవడం వల్ల కాలుష్యం పెరగడంతో పాటు భూగర్భ జలాల పునరుత్పత్తికి కూడా ఆటంకం ఏర్పడినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం తొలగిస్తున్న లక్షల టన్నుల పూడికను పర్యావరణానికి హాని కలగకుండా రాంకీ సంస్థ ద్వారా తరలిస్తున్నారు. గణేష్ నిమజ్జనాల నాటికి చెరువులో తగిన నీటి నిల్వలు ఉండేలా పనులను వేగవంతం చేశారు. నిమజ్జనాల అనంతరం 72 ఎకరాల విస్తీర్ణంలో ఐడీఎల్ చెరువు పూర్తి పునరుద్ధరణ పనులను చేపట్టేందుకు హైడ్రా ప్రణాళిక రూపొందించింది.

## బీఆర్ఎస్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే సస్పెన్షన్: ఎంపీ వద్దిరాజు

- అసెంబ్లీ నుంచి సభ్యుల సస్పెన్షన్ గర్హనీయమని వ్యాఖ్య
- 420 హామీలు, 6 గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ
- ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టం



**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడిగే ప్రశ్నలకు, లేవనెత్తే అంశాలకు సమాధానాలు చెప్పలేకే వారిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నిస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలు, 13 డిక్లరేషన్ల అమలులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారని, అయితే 33 నెలలు, వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని అన్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటంతో అధికార పార్టీ దిక్కుతోచని స్థితిలో పడిందని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించకుండా అడ్డుకోవడానికే ఈ చర్యలు తీసుకున్నారని విమర్శించారు. అసెంబ్లీకి వెళ్లకుండా తమను అడ్డుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలు, నెరవేరని హామీలను ఎండగడుతూ పోరాటం కొనసాగిస్తామని వద్దిరాజు పేర్కొన్నారు.

## గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రులు



- లోక్ భవన్‌లో గవర్నర్‌తో భేటీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో సమావేశం
- పాల్గొన్న పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, మహ్మద్ అజారుద్దీన్, వివేక్, లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, వేద్మ బొజ్జు పటేల్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గవర్నర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

లోక్ భవన్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశం సౌహార్ద వాతావరణంలో సాగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గవర్నర్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాల అమలు, ప్రజా సంక్షేమ చర్యలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించినట్లు సమాచారం. గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాతో జరిగిన ఈ భేటీ సందర్భంగా ప్రజా ప్రతినిధులు పలు అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో పరస్పర సహకారం కొనసాగించాలని చర్చించినట్లు తెలిసింది. ఈ సమావేశం అనంతరం గవర్నర్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు సౌజన్యంగా ఫోటోలు దిగారు. సమావేశం విజయవంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించిన జిల్లా యంత్రాంగం



**నారాయణపేట, సెప్టెంబర్ 09, (తెలంగాణ ముచ్చట్లు) :** వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల తయారీలో వాడే కృత్రిమ రంగులు, రసాయనాల వల్ల జల వనరులు తీవ్రంగా కలుషితమవుతున్నాయని జిల్లా పాలనాధికారి సి.హెచ్ ప్రియాంక ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే కృత్రిమ రంగులతో చేసిన విగ్రహాలను వదిలి మట్టితో చేసిన విగ్రహాలనే పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన మట్టి గణపతి ప్రచార చిత్రాలను జిల్లా పాలనాధికారి ప్రియాంక, జిల్లా పోలీసు అధికారి వినీత్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకృతికి హాని చేయని మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. భక్తితో పాటు బాధ్యత కూడా అవసరమని అన్నారు.ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ అవగాహనలో భాగంగా ఎనిమిది అంగుళాల మట్టి గణపతులను అందించే కార్యక్రమాన్ని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్టి విగ్రహాలు త్వరగా నీటిలో కరిగిపోయి చెరువుల్లో పూడిక సమస్య రాకుండా చేస్తాయని, జలచరాలకు హాని కలగకుండా ఉంటుందని వివరించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in